

# వృద్ధాప్యం

**- ఐ.ఎ. నరసింహం**

గదిలో చిన్న శబ్దానికే మెలకువ వచ్చింది అనంతరామయ్య గారికి. కళ్ళు తెరిచారు. చిమ్మచీకటి దర్శన మిచ్చింది.

ఆ మధ్య రాత్రిపూట కొంచెం లీలగా కనిపించే కళ్ళు —రాను రాను మూసుకుపోయాయి. అందుకే తన గదిలో ఓ బల్బ్ చిరుకాంతులు ప్రస రిస్తూ వెలుగుతోందని అతనికి తెలిసి రాలేదు.

అప్పుడు సమయం రాత్రి పన్నెండు గంటలు కావచ్చు. సుమారు పదిన్నర పదకొండు గంటల వరకూ, ఇరుగూ —పొరుగూ అలికిడిగానే ఉంటారు. అందరూ నిద్ర పోతున్నట్టు వాతావరణమంతా ప్రశాంతంగా ఉన్నట్టు అనిపిస్తే అలా ఆ టైముని అంచనా వేసుకోగలిగారా యన.

నాలుక పొడారి పోతున్నట్టయింది. కాసిని మంచినీళ్ళు తాగి పడుకోవాలనిపించింది.

మంచం మీంచి లేచి కాళ్ళకు అడ్డు తగిలిన దుప్పటిని తప్పించి మెల్లగా కాళ్ళు కిందికి వేలాడదీసి, నడుం వంచి, కుడి చేతిని మంచం కిందికి పోనిచ్చి నేల తడిమారు.

ప్రతి రోజూ మంచం కింద తన తల దగ్గర ఉండే నీళ్ళు చెంబు కోడలు శార్వరి చోటు మార్చి పెట్టిందేమో మరి —చేతికి —తగల లేదు. ఆ ప్రాంతంలో తన చేతికర్ర దొరికింది.

మంచం దిగి కింద కూర్చున్నారు అనంత రామయ్య.

ఓ ఆలోచనొచ్చింది —వెంటనే ఆ కర్ర చేతి లోకి తీసుకుని మంచం కింద పెట్టి మెల్లగా తడిమారు.

ఖంగ్‌మనే శబ్దం.

కర్ర తాకిడికి చెంబు తిరగబడి నేల పొర్లింది.

అంతే —

నీళ్ళన్నీ ఒలికిపోయి, తన కాళ్ళ వరకూ వచ్చి —కట్టుకున్న పంచె కొంత భాగాన్ని తడి పేశాయి.

గుండె గుభేల్‌మందాయనికి.

రెండు క్షణాలు బాధగా మూల్గారు. ఆ బాధ నీళ్ళు పడిపోయినందుకు కాదు. ఆ పంచె అలా నీళ్ళతోనే తడిసిందని అనుకోక ఇంట్లో వాళ్ళు మరోలా అర్థం చేసుకుంటే...

పేలవంగా నవ్వుకున్నారాయన.

మరో రెండు నిమిషాల తరువాత —తడి సిన పంచెను కుడి చేత్తో గట్టిగా పిండేసి మొలను దోపుకున్నారు. వెంటనే కోడలిని పిలిచి మరో చెంబుడు నీళ్ళు అడగాలనుకు న్నారు.

సరిగ్గా అప్పుడే ఓ సంఘటన జ్ఞాపకానికొ చ్చింది.

ఒకరోజు తనకిలాగే అర్ధరాత్రి నీళ్ళు తాగాల నిపిస్తే మంచం దిగి చీకటిని చీల్చుకుంటూ కొడుకు, కోడలు పడుకున్న గది తలుపు తట్టారు. పది నిమిషాల తర్వాత కాబోలు తలుపు తెరిచి—

'ఏం... ఏం కావాలి?' అంది శార్వరి.

తన అవసరం చెప్పారాయన.

తన నిద్ర పాడుచేసినందుకు విసుక్కుం టూనే రుసరుసా లోనికి వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చి గభాలున తలుపు మూసింది.

ఆయన చాలా బాధపడ్డారు.

తర్వాత మెల్లగా తన గదిలోకి చేరుకుంటుంటే —'పాడు సంత. రాను రాను మీ నాన్నగారి వ్యవహారం చాలా దారుణంగా ఉంది. నేనింక ఎంతో కాలం ఆయన కింద సేవలు చెయ్య లేను. మీరో నిర్ణయానికొచ్చి ఆయన్ని ఏ అనా థశరణాలయంలోనో చేర్పించీరాదు' అంటూ విసుక్కునే మాటలు గదినుంచి స్పష్టంగా విని పిస్తే బాధగా నిట్టూర్చారు. అప్పటినుంచి ఓ చెంబుడు నీళ్ళు మంచం కింద పెట్టి —'ఇదిగో మీ తల దగ్గరే ఉన్నాయి నీళ్ళు. అర్ధరాత్రి వేళ మళ్ళీ తలుపులు బాదకండి' అంటూ ఓ చిన్న హెచ్చరిక చేసి చెప్తోంది. గత రాత్రి మాత్రం అలా చెప్పలేదు —అందుకే నీళ్ళు పెట్టినట్టు కూడా తనకు తెలిసిరాలేదు. ఫలితంగా...

అనంతరామయ్యగారికేం తోచలేదు. అందుకే ఆ రాత్రి మళ్ళీ అలా తలుపు తట్టే ప్రయత్నం చెయ్యలేదు.

ఒకపక్క బెదురు. మరోపక్క నీళ్ళు తాగా లనే కోరిక. పోనీ ఎలాగోలా ఈ రాత్రికి ఈ దాహాన్ని అరికట్టుకు పడుకున్నా గదిలో నీళ్ళు పడి పాడయినందుకు తెల్లారి కోడలు ధుమధు మలాడక మానదు. ఓ క్షణం ఆయన అంతరం గం అలజడికి గురైంది.

తన దౌర్భాగ్యానికి, అంధత్వానికి, వార్ధక్యపు జీవితానికి కాసేపు తిట్టుకున్నారాయన.

తన గొంతులో నీళ్ళు పడకపోయినా కళ్ళలో చాలా ఉన్నట్టున్నాయి. అందుకే రెండు కన్నీ బొట్లు నేలరాలాయా క్షణంలో.

అప్పుడనిపించింది.

బాల్యం, యవ్వనం, కౌమార దశలు ప్రతి మనిషికీ కొంచెం బాగానే గడిచిపోతాయి. వృద్ధాప్యం మాత్రం దారుణం. ఈ దారుణమైన స్థితిని అనుభవించి మరీ చావు అనేనా — పెద్దలు 'దీర్ఘాయుష్మాన్ భవ' అని దీవించడం?

పిచ్చిగా నవ్వుకున్నారాయన.

నిజమే—

ఏది ఏమైనా మనిషి బతుకు యాభై ఏళ్ళకు —ముగిసిపోతేనే బాగుంటుంది. అంతకు పైబడ్డ వయసుకు అసరాగా ఆరోగ్యకరమైన భార్య, సంస్కారవంతులైన బిడ్డలో ఉంటే ఆ వ్యక్తి కొంచెం అదృష్టవంతుడౌతాడు. ఇక్కడ

కొడుకు సంస్కారం అప్రస్తుతమనిపిస్తే తన దురదృష్టం కొద్దీ తను కోరుకున్న విధంగానే కొన్నేళ్ళ క్రితం తన ఒడిలో ఆనందంగా కన్ను మూసింది భార్య.

ఆ నాటి నుండీ తన బతుకో చుక్కాని లేని నావలా తయారైంది. ఆ తర్వాతే తనీ కొడుకు పంచను చేరవలసి వచ్చింది.

ఏది ఏమైనా తనకీ స్థితి ఓ శాపంలా తయారైందన్నది ఆయన విశ్వాసం. అందుకే కొన్నాళ్ళపాటు ఓర్పుతో తన దైనందిన అవసరాలు కొన్ని పనిమనిషి ద్వారా, మరికొన్ని పిల్లల ద్వారా తీర్చుకుంటూ బాధగా కాలం గడిపేశారు.

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నారేగాని కళ్ళు కంటే చెవులే పోయి ఉంటే బాగుండేది. ఇప్పుడా చెవుల ద్వారా తనను గురించి ఇతరులు విసుక్కునే మాటలు వింటుంటే, తన శరీరానికి సజీవంగా నిప్పు పెట్టి ...ల్చుకోవాలనిపిస్తోంది.

రెండు రోజుల క్రితం—

వీధి వరండాలో నిలబడి ఉంది శార్వరి. ఆమె దగ్గర మరో ముగ్గురు ఇరుగుపొరుగు స్త్రీలు. అందరూ కలిసి ఏ విషయానికో తెగ బాధపడి పోతున్నారు. వినగా వినగా తెలిసింది. ఆ రోజు ఆ వీధి చివర్లో ఓ అబ్బాయి చచ్చిపోయాడట.

'చాలా దారుణం సుమా త్రివేణీ' అంటోంది శార్వరి.

'దారుణమా మరి దారుణమా ముసలాడా — ముతకాడా చెప్పు. పాపం యుక్తవయసులోకి అడుగు పెడుతున్న బిడ్డ' అంటోంది త్రివేణి అనబడే అమ్మాయి.

అనంతరామయ్య గారి మనసు చివుక్కుమంది.

'అంటే ముసలాడు చస్తే ఈ సమాజం ఏమాత్రం సానుభూతి ప్రకటించదన్న మాట' అనుకున్నారు మనసులో బాధగా.

కొంచెంసేపు తర్వాత—

వాళ్ళు మళ్ళీ మరో సంభాషణలోకి ...రారు.

'ఏవమ్మోయ్ శార్వరీ, ఎల్లుండి మేము కుటుంబంతో తిరుపతి వెళ్తున్నాం, మీకూ ఎలాగూ మొక్కు ఉందని అన్నావు మీ ఆయనతో చెప్పి బయలుదేరి రాకూడదు? ఎంత ఐదు రోజుల్లో తిరిగి వచ్చేస్తాం' అంటోంది ఒకామె.

బాధగా మూల్గింది శార్వరి.

'అదేమిటి? ... ఒక్కసారి అలా అయిపోయావ్?'

'మరేం చెయ్యమంటావ్. మీలాగ ఏ బాదరబందీ లేని జీవితాలు కావు మావి. పైగా మా ఇంట్లో ఓ ముసలాడున్నాడు. ఆయనకు కళ్ళైతే పత్తికాయల్లా ఉన్నాయి కానీ —చూపు లేదు. ఆ ముసలాడిని ఇంట్లో వదిలి మేమెక్కడికి బయలుదేరగలం? నీకో విషయం తెలుసో లేదో ప్రతి రోజూ ఇంట్లో నౌకరీ పావు వంతైతే, ఆయన కింద చాకిరీ ముప్పావు. ఇంకా చాలక అతను అర్ధరాత్రి పూట కూడా కొన్ని అవసరాలకు తలుపులు బాది ప్రాణాలు తింటున్నాడు. రాత్రులు దగ్గుతోనూ కళ్ళు కనిపించక సామాన్లు కాలితో తన్నేసే చప్పుళ్ళతోనూ నిద్ర పట్టనివ్వడం లేదు. ఆయన్ని వదిలి కుటుంబంతో ఎక్కడికన్నా వెళ్ళే రోజు మా కంత త్వరగా రాదేమో' అంది శార్వరి.

ఫక్కున నవ్విందొకామె.

'ఔను సుమా. నువ్వు చాలా శ్రమ పడుతున్నావనే అనుకుంటున్నాం. ఐనా ఎన్నైనా పడగలం గానీ ముసలాళ్ళతో మాత్రం వేగలేం' అంది ఇంకొకామె.

'అదీ నిజమే—

వాళ్ళొక రకంగా బాధపెట్టరు. చూసినవన్నీ తినాలంటారు. తిన్నది అరిగించుకోలేక అనారోగ్యంతో బాధపడతారు. అనవసరంగా చిరాకు ప్రకటిస్తారు. ఒక పనికి ఒక పని చేసి పీకల మీదికి తెస్తారు. చెప్పినట్టు వినరు. చేసినట్టు నచ్చరు. ఏమన్నా కొంచెం విసుక్కున్నామంటే కొడుకుతో ఫిర్యాదు చేసి భార్యాభర్తల మధ్య చిచ్చు పెట్టేస్తారు. ముసలాళ్ళున్న ఇంట్లో బతకడం కొంచెం కష్టమే' అంది మొదటి ఆమె మళ్ళీ అనునయంగా.

> 'భగవంతుడా నేనేం తప్పు చేశాను? జీవితంలో ఎన్నో సమస్యల్ని తట్టుకున్నాను. ఎన్నో కష్టాలను ఓర్పుతో నెట్టుకుంటూ వచ్చాను. చిన్న ఉపాధితోనైనా బతుకు భారాన్ని అందంగానే మోశాను. ఉన్న ఒక్కగానొక్క కొడుకుని పెంచి పెద్దచేసి ప్రయోజకుణ్ణి చేశాను. మొన్నటి వరకూ సమాజంలో ఎంతో కొంత గౌరవంగానే బతికాను.

'కొంచెమేమిటి? నేను ప్రతిరోజూ ఆ ముసలాయనతో నరకం అనుభవిస్తున్నాను.

చప్పటి కూరలు వండాలి. వేడినీళ్ళు కావాలి. స్నానానికి నులివెచ్చని నీళ్ళు అమర్చాలి. మంచం మీద బట్టలు మార్చాలి. రోజూ అతని గది ఫినాయిల్‌తో కడగాలి. ఆ మధ్య ఈ పనులన్నీ నేనే చేసేదాన్ని. రాను రాను నాకు శ్రమ ఎక్కువైపోతోందని మొత్తుకుంటే వారం క్రితం ఓ పనికుర్రాడిని పెట్టారాయన. ఆ కుర్రాడు మొదటి రెండు రోజులూ బాగానే చేశాడు. మూడో రోజు దుర్గంధభూయిష్టమైన ఆయన గదిలో పడుకోలేనని చెప్పి వెళ్ళిపోయాడు.

ఏం చేస్తాం? అన్ని పనులూ మనం చెయ్యలేం. కొన్నిటికి ఆయన వెంట ఓ మగాడు అవసరం. ఆ తోడు కరవై ఆ ముసలాడు తడుముకుంటూ గదులు దాటి పెరట్లోకి వెళ్తున్నప్పుడు —దార్లో కత్తిపీటలనో, ద్వారబంధాలనో గుద్దుకుని దెబ్బలు తగిలించుకుంటున్నాడు. అంతే — డాక్టర్లు —మందులు —

అసలే చిన్న జీతంతో ఇంటి అద్దె —పాలు — కూరలు వంటి కనీసావసరాలే గట్టెక్కడం కష్టంగా ఉంటే మధ్యలో ఇదో అదనపు ఖర్చై మేము మరింత ఆర్థికంగా చితికిపోతున్నాం...' శార్వరి ఆ బాధలో కాస్తంత వెటకారం ధ్వనించేలా మాట్లాడే సరికి —మిగతా ఇద్దరూ పగలబడి నవ్వుతున్నారు.

ఓ పది నిమిషాల తర్వాత—

ఆ అమ్మలక్కలు వెళ్ళిపోయి ఆ ప్రదేశాన్ని ప్రశాంతపరిచారు.

అనంతరామయ్యగారికా మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి. అప్పుడర్థమయింది అతనికి. ఇతరుల స్వేచ్ఛాయుత జీవనానికి తనెంత అవరోధంగా ఉన్నాడో.

'భగవంతుడా నేనేం తప్పు చేశాను? జీవితంలో ఎన్నో సమస్యల్ని తట్టుకున్నాను. ఎన్నో కష్టాలను ఓర్పుతో నెట్టుకుంటూ వచ్చాను. చిన్న ఉపాధితోనైనా బతుకు భారాన్ని అందంగానే మోశాను. ఉన్న ఒక్కగానొక్క కొడుకుని పెంచి పెద్దచేసి ప్రయోజకుణ్ణి చేశాను. మొన్నటి వరకూ సమాజంలో ఎంతో కొంత గౌరవంగానే బతికాను. ఇప్పుడు బాధ్యతల నుండి తొలగిపోయే వయసు రావడంతో అతి త్వరలోనే తుదిశ్వాస విడవాలనే తాపత్రయంతో, క్షణమో యుగంలా భారంగా, దీనంగా బతుకుతుంటే నువు కొనఊపిరి తియ్యలేకపోతున్నాం.

ఒకప్పుడు ముసలాళ్లంటే పూజ్యులు. తన లాంటి వృద్ధులకు ఎందరో పాదాభివందనం చేసేవారు.

ఆ రోజులు పోయాయి. ఈ కాలం వారికి—

ముసలాడంటే ఓ ఆటబొమ్మ. ముసలాడిని చూస్తే పెద్దలకు నిర్లక్ష్యం. పిల్లలకు హేళన. వారినే పనీ చెయ్యనివ్వరు. ఎక్కడికీ తీసుకెళ్ళరు. ఏమీ మాట్లాడరు. ఏ సలహా వినరు. విన్నవి పాటించరు.

అంతేకాదు. ముసలాడైనందుకు చావుకోసం తనకంటే ఇతరులే ఎక్కువగా ఎదురుచూస్తారు అన్న నిజం తనకి తెలీకపోదు—

కానీ ఎలా? చావు రాదే...' ఆ ఆలోచనతో ఆయన తల బరువెక్కిపోయింది. అప్పుడు మాత్రం నీళ్ళు ఖచ్చితంగా గొంతులో పోసుకోవాలనిపించింది.

ఓ ఆలోచనొచ్చింది.

అంతే—

ఆ చీకటిలోనే తన చేతికర్రను తడిమి మంచం కింద పెట్టి చెంబు ఉనికిని గమనించి చేతులోకి తీసుకున్నారు. ఇందాకటి చెంబు బోర్లాపడే అవకాశం లేదు కనుక. అందులో కొంచెం నీళ్ళున్నాయి. వెంటనే గొంతులో పోసుకున్నారు.

ప్రాణం చేరినట్టయింది.

దూరంగా కోడి కూసింది.

అనంతరామయ్యగారు లేచి నిలబడి కర్రసాయంతో మెల్లగా అడుగులు వేస్తూ ఆ ఇల్లు దాటారు. ఇప్పుడాయనకి తృప్తిగా ఉంది.

•